ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 8 జూన్ 2025



16న బహిరంగ వేలం

సుల్తానాబాద్, జూన్ 7: (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ నిధులతో చేపట్టిన షాపింగ్ గదులను కేటాయించడానికి ఈనెల 16న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్మించిన ఐదు షెట్టర్లను పొందాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు రుసుం కింద పది వేల రూపాయలు చెల్లించాలని, ఈ నెల 9 నుంచి 14 వరకు దరఖాస్తులు పొందాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 14 సాయంత్రంలోగా ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని, ఈనెల 16 ఉదయం 11 గంటలకు సమావేశ మందిరం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.


ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

కోల్‌సిటీటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో జనగామ జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాదాసి మహాలక్ష్మి ఎంపికయ్యారు. మహాలక్ష్మికి యేటా రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనున్నది. ఎంపికైన విద్యార్థిని జెడ్‌పీహెచ్ఎస్ హెచ్ఎం జ్యోత్స్నలత, ఉపాధ్యాయ బృందం అభినందించారు

నల్లనేలపై కొత్త ఖనిజాలు



- 14 రకాలు ఉన్నట్లు గుర్తింపు
- అధ్యయనానికి సింగరేణి యాజమాన్యం కసరత్తు
- జియో సైన్స్ ల్యాబరేటరీ ఏర్పాటుకు సన్నాహాలు
- ఫ్లైయాష్, బాటమ్ యాష్‌లపై పరిశోధనలు

గోదావరిఖని, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంత బొగ్గు, మట్టి పొరల్లో అనేక ఖనిజ సంపదలు ఉన్నట్టు వెల్లడవుతున్నది. బొగ్గును వెలికి తీసేందుకు తవ్వుతున్న మట్టి పొరల్లో బొగ్గు మండించడం ద్వారా విద్యుత్ సంస్థల్లో ఏర్పడుతున్న బూడిదలో సైతం అనేక రకాల ఖనిజాలు బయట పడుతున్నాయి. సింగరేణి యాజమాన్యం ఈ ఖనిజాల పరిశోధనపై దృష్టి సారించింది. కొంత కాలంగా జరుపుతున్న పరిశోధనల్లో ఆర్ఈఈ (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఉన్నట్టు తేలింది. 14రకాల ఖనిజాలు సింగరేణి ప్రాంత బొగ్గు, మట్టి పొరల్లో కనబడుతున్నాయి. ఇందులో ప్రధానంగా సిరియం, లాంథనం, నియోడిమియం, పేసియోడిమియం, గాడా నిలియం, డిస్ప్రోజియం, ల్యూటెటియం, రెనాడియం, స్ట్రాంటియం, జిర్కోనియం లాంటి అనేక ఖనిజాలు ఈ మట్టిలో ఉన్నట్టు తెలుస్తున్నది.

ఈ ఖనిజ సంపదపై మరింత అధ్యయనం చేసేందుకు సింగరేణి యాజమాన్యం సంస్థకు అనుబంధంగానే జియో సైన్స్ లేబోరెటరీని ఏర్పాటు చేసేందుకు సిద్ధపడింది. ఖనిజ రంగంలో దేశ స్వయం సమృద్ధి లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు సింగరేణి ప్రయత్నాలు మొదలు పెట్టింది. జాయింట్ వెంచర్లుగా ఏర్పాటు చేయడానికి కూడా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ రంగంలో సలహాలు, సంప్రదింపుల కోసం డెలాయిట్ సంస్థను కన్సల్టెన్సీగా నియమించుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వ హించే కీలక ఖనిజాల వేలంలోనూ పాల్గొనడానికి సంస్థ సంసిద్ధతను వ్యక్తపరుస్తున్నది.

అంతేకాకుండా ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్ ప్రభుత్వ ప్రతినిధులతో కూడా ఖనిజాల ఉత్పత్తికి ఉమ్మడిగా పాల్గొనేందుకు సంప్రదింపులు జరుపుతున్నది. ఈ అంశాలపై సీఎండీ బలరాంనాయక్ కేంద్ర గనుల శాఖ నిర్వహించిన జాతీయస్థాయి కీలక ఖనిజాల సద స్సులో వెల్లడించారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నుంచి ఉత్పత్తిలో భాగంగా విడుదల అవుతున్న ఫ్లైయాష్‌ను భువనేశ్వర్‌లోని ఐఎంఎంటీసీ ల్యాబోరేటరీలో పరిశీలించగా ఆర్ఈఈ(రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఉన్నట్టు నిర్ధారణ జరిగింది.

ఖమ్మం జిల్లా కల్లూరు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో కూడా కీలక ఖనిజాలు ఉన్నట్టు గమనించారు. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, నియోబీయం ఖనిజాలకు కార్బో నేటైస్ ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. రామగుండం ఓపెన్‌కాస్టు-2 గనిలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్లలో ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లో ఖనిజాలు ఉన్నట్టు సింగరేణి యాజమాన్యం గుర్తించింది. వీటిలో ప్రధానంగా సిరియం, లాంథనం, నియోడిమియం, ప్రెసియోడిమియం, గాడోలినియం, డిస్ప్రోజీయం, యూటేటియం లాంటి ఖనిజాలు ఉన్నట్టు వెల్లడయ్యింది. రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ జరిపిన పరిశోధనల్లో కూడా రామగుండం ఓసీపీ-2లో కూడా వెనాడియం, స్ట్రాంటియం, జిర్కోనియం ఉన్నట్టు వెల్లడయ్యింది. దీంతో సింగరేణి యాజమాన్యం కోల్‌బెల్ట్ ప్రాంతంలోని ఓపెన్‌కాస్టు మట్టి పొరల్లో సింగరేణి బొగ్గు నుంచి వస్తున్న ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లపై పూర్తి స్థాయి పరిశోధన జరిపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ఇప్పటికే బొగ్గు, థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, సంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో విస్తరించిన సింగరేణి ఈ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న వివిధ రకాల ఖనిజాలను పరిశోధించి వెలికి తీసేందుకు కూడా ప్రయోగాలు మొదలు పెట్టింది. ఇక్కడి మట్టి పొరల్లో, బొగ్గు పొరల్లో ఖనిజాల సాంద్రత ఎక్కువగా ఉన్నట్టు తేలితే సింగరేణి సంస్థ మరో ఖనిజ ఉత్పత్తి రంగంలో కూడా అడుగుపెట్టినట్టు అవుతుంది. సింగరేణి చేస్తున్న ఈ ఖనిజాల పరిశోధన రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిగా అంగీకారం తెలిపినట్టు తెలిసింది.

ఎర్రజెండాలను అంతం చేయడం ఎవరితరం కాదు



జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రజెండాలను అంతం చేయడం ఎవరితరం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. శనివారం ఎస్ఎస్ గార్డెన్లో సీపీఐ మండల, పట్టణ పదవ మహాసభలు నిర్వహించారు. మహాసభల సూచకంగా ఎర్రజెండాను జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జెండా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలవేన శంకర్ మాట్లాడుతూ పార్టీ బలమైన శక్తిగా ఎదగడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈనెల 28న జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 నాటికి వామపక్ష పార్టీలతోపాటు మావోయిస్టులను లేకుండా చేస్తామని ప్రకటించడం, బూటకపు ఎన్‌కౌంటర్లతో కర్రెగుట్టలో నరమేధాన్ని సృష్టిస్తున్నారన్నారన్నారు. ఇప్పటికే 5 వందల మందికి పైగా బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపారని, ఆదివాసీలను కూడా కాల్చి చంపుతున్న పరిస్థితిని మోదీ ప్రభుత్వం తీరును ఖండిస్తున్నామన్నారు. అణచివేత ఉన్నంతకాలం నక్సలిజం ఉంటుందని, ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పట్టణాల్లో ప్రజాప్రతినిధులుగా పోటీ చేసి గెలవాలన్నారు. అప్పుడే పేద ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా కార్మిక కర్షక సమస్యల్ని పరిష్కరించేందుకు సీపీఐ ముందు ఉంటుందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, కడారి సునీల్, మార్క్కాపురం సూర్య, బాలసాని లెనిన్, పూసల రమేష్, ఆరేపల్లి మనోజ్ కుమార్, చంద్రగిరి ఉదయ్, కల్లేపల్లి నవీన్, దొమ్మటి రాజేష్, రవి, రామస్వామి, అంజి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ చలపతిరావు

కళ్యాణ్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలపతిరావు అన్నారు. శనివారం గోదావరిఖని గాంధీనగర్‌లో ఐఎఫ్‌టీయూ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూడు రోజుల క్రితం బీజాపూర్ నేషనల్ పార్క్ వద్ద అరెస్టు చేసిన కేంద్ర కమిటీ సభ్యులు సుధాకర్‌ను చిత్రహింసలు పెట్టి ఎన్‌కౌంటర్ చేశారన్నారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు ముందుకు వచ్చి కాల్పుల విరమణ పాటిస్తున్నా ఏకపక్షంగా నిరాయుధులుగా ఉన్నవారిపై హత్యాకాండ కొనసాగించడాన్ని ప్రజలందరూ ఖండించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న వారిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. నాయకులు ఐ కృష్ణ, నరేష్, వెంకన్న, శంకర్, అశోక్, బుచ్చక్క పాల్గొన్నారు.

ప్రేమ, త్యాగానికి ప్రతీక బక్రీద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రేమకు, త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం శారదానగర్, ఫోరింక్లయిన్ ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ అనేది త్యాగానికి, విశ్వాసానికి, విధేయతకు ప్రతీక అని, ప్రవక్త ఇబ్రహీం కోసం త్యాగం, నిస్వార్థత, ధైర్యం, భక్తి అనే విలువలను గుర్తు చేస్తుందన్నారు. మనం పంచుకునే ప్రేమలో మానవత్వం ఉంటుందన్నారు. ముస్లీం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, మైనార్టీల కోసం విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు తీసుకువచ్చారని, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. రామగుండం నియోజకవర్గంలో ఈద్గాలు, కబరస్తాన్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, ఫజల్‌బేగ్, ముస్తాఫా, ఫకృద్దీన్, దాసరి సాంబమూర్తి, అశ్రఫ్, రహీం, ముస్తాఫా పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ప్రవేశాల్లో సిఫార్సులకు అవకాశం ఇవ్వొద్దు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్ఈ ప్రవేశాల్లో రాజకీయ సిఫార్సులతో సీట్లు కేటాయించవద్దని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్‌ను కలిసి అడ్మిషన్లు జరుగుతున్న తీరుపై చర్చించారు. నర్సరీ నుండి 9వ తరగతి వరకు 408 సీట్లు ఉన్నాయని, వాటిని సింగరేణి కార్మికుల పిల్లలతో భర్తీ చేయాలని కోరారు. సిఫార్సులను పరిగణలోకి తీసుకోకుండా పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ జరపాలని కోరారు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వాలని, కొందరు రాజకీయ నాయకులు అడ్మిషన్ల కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ రవీందర్, నాయకులు ప్రకాష్, రాజారత్నం, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు ఉన్నారు.

పారదర్శకంగా సీబీఎస్ఈ అడ్మిషన్లు

సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల సెక్టార్-3లో సీబీఎస్ఈ అడ్మిషన్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు ఇస్తున్నట్టు తెలిపారు. సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ల విషయంలో అసత్య ప్రచారాలు, అపోహలను నమ్మవద్దని కోరారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న పోలీస్‌స్టేషన్లు

- పెద్దపల్లి రూరల్, ట్రాఫిక్, మహిళా, ఎలిగేడు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు



పెద్దపల్లిలో సిద్ధమైన మహిళా పోలీస్ స్టేషన్

పెద్దపల్లిటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు కొత్త పోలీస్‌స్టేషన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఈనెల 10వ తేదీ తర్వాత ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఎన్నో ఏళ్ళుగా ప్రతిపాదనల్లో ఉన్న ఎలిగేడు, పెద్దపల్లిరూరల్, పెద్దపల్లి ట్రాఫిక్, పెద్దపల్లి మహిళా పోలీస్‌స్టేషన్ల మంజూరుకు గతేడాది డిసెంబర్ 2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంగా అయిన తర్వాత పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు, ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పెద్దపల్లికి మరొక సీఐ పోస్ట్ పెరిగే అవకాశాలున్నాయి.

బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న రాఘవాపూర్, రంగాపూర్, సబ్బితం కుర్మపల్లి, రాగినేడు, బ్రహ్మనపల్లి, అప్పన్నపేట, బొంపెల్లి తదితర గ్రామాలు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. ఈ పోలీస్‌స్టేషన్ రాఘవాపూర్‌లో ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖ గుర్తించింది. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరడంతో చివరికి కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ బిల్డింగ్‌ను ఎంపిక చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ బంధంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామస్థులు పాఠశాల కావాలని వినతులు అందజేశారు. దీంతో వ్యవసాయ మార్కెట్‌లోని అగ్రికల్చర్ ఏడీఈ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కొనసాగించేందుకు నిర్ణయించారు. పెద్దపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా మరొక సీఐ పోస్టును కేటాయించి, పెద్దపల్లి రూరల్, జూలపల్లి, ధర్మారం, బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్లకు కలిపి రూరల్ సీఐని కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

2001 జూన్‌లో జూలపల్లి మండలం నుంచి ఎలిగేడు మండలాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఏర్పాటుచేయగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలిగేడు మండలం కొనసాగుతున్నది. ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు పలుమార్లు ఆయా ప్రభుత్వాలకు నివేదించినప్పటికీ మంజూరు కాలేదు. 2016 అక్టోబర్‌లో పెద్దపల్లి జిల్లా ఏర్పాటు కాగా, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి మండలాలను ఏర్పాటుచేశారు. రామగిరి, అంతర్గాం మండలాలకు పోలీస్ స్టేషన్లను మంజూరు చేసి ఎలిగేడుకు చేయలేదు. ఎమ్మెల్యే విజయరమణారావు చేసిన ప్రతిపాదన మేరకు ఎట్టకేలకు 23 ఏళ్ల తర్వాత ఎలిగేడు మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరైంది. ఖాళీగా ఉన్న జూనియర్ కాలేజీలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

పనులు పూర్తి చేశాం

ఏసీపీ గజ్జి కృష్ణ

కొత్త పోలీస్‌స్టేషన్ల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రారంభమైతే ప్రజలకు, మహిళలకు ఎంతో సౌకర్యవంతగా ఉంటుంది. నేరాలు కూడా అదుపులోకి వస్తాయి.

మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్థులు



బాయమ్మపల్లిలో లారీలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

ఓదెల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాయమ్మపల్లిలో శనివా రం గ్రామస్థులు మట్టి లారీలను అడ్డుక న్నారు. అధిక లోడ్‌తో లారీలు వెళ్లడంతో బీటీ రోడ్డుతో పాటు, సీసీ రోడ్డు ధ్వంసం అవుతుందని నిరసిస్తూ సుల్తానాబాద్ వైపు వెళ్లే మట్టి లారీలను నిలిపివేశారు. గ్రామంలోని ఆలయానికి విరాళం ఇవ్వా లని, అలాగే ధ్వంసమవుతున్న రోడ్లను నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీంతో మట్టి కాంట్రాక్టర్లు ఒప్పుకోవడంతో గ్రామస్థులు నిరసన విరమించారు.

నేడు మంత్రివర్గ విస్తరణ
- కవ్వంపల్లి, అడ్లూరిలో ఒకరికి అవకాశం
- రేసులో ఆది శ్రీనివాస్ కూడా..
7

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు
- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్
8

ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

ఆలయాల్లో ఆకట్టుకొంటున్న శిల్ప కళా సౌందర్యం


శతాబ్దాలు గడిచినా వన్నె తగ్గని కాకతీయుల కళా వైభవం



మండపాల చుట్టూ ఉన్న బండలపై చెక్కిన కళారూపాలు

మంథని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయులు నిర్మించిన ఆలయాల్లో శతాబ్దాలు గడిచినా నాటి కళా సౌందర్యం కనువిందు చేస్తోంది. మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలం సుందిళ్ళ లక్ష్మి నృసింహాస్వామి, జనగామ రామలింగేశ్వరస్వామి, మంథని మండలంలో గుంజపడుగు ఒడ్డున ఉన్న కాసిపేట శివాలయం, మంథనిలోని గౌతమేశ్వరస్వామి, శీలేశ్వర-సిద్దేశ్వరాలయం, మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర-ముక్తీశ్వరస్వామి ఆలయాల్లో శిల్పకళా వైభవం ఆకట్టుకుంటోంది. మానేరు నది తీరంలోని ముత్తారం మండలం ఖమ్మపల్లి శివారులో ఉన్న సందరెల్లి గుడులు (శివాలయం), మల్హర్ మండలం వీసీనగర్ సమీపంలోని నైనా గుళ్ళు (శివాలయం) గత శిల్పకళా వైభవానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వీటిలో నైనా, సందరెల్లి, కాసిపేట గుడులు శిథిలావస్థకు చేరాయి. అయినా నాటి శిల్ప కళా సౌందర్యం కనువిందు చేస్తున్నాయి. సుమారు ఆరు శతాబ్దాల క్రితం గోదావరినది తీరంలోని ఈ ఆలయాలను కాకతీయులు అభివృద్ధి చేసినట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

బండరాయితోనే ఆలయా లను నిర్మించడంతోపాటు అందులో గర్భాలయాలు, దాని ముందు నిర్మించిన మండపాలు, పైన వలయాకారంలో వివిధ కళారూపాల్లో చెక్కారు. అలాగే ఆలయాల ముందు, నాలుగువైపులా ఉన్న స్తంభాలు, చుట్టు ఉన్న ప్రాకారాలపై చెక్కిన వివిధ భంగిమల్లో దేవతామూర్తుల విగ్రహాలు, రాజులు, దాసీలు, సైన్యం, ఏనుగులు, ఎద్దులు, గుర్రాలు , యుద్ధంలో వినియోగించే వివిధ ఆయుధాలు, ఆలయానికి, ప్రాకారాలకు నలువైపులా ఉన్న స్తంభాలను కింది నుంచి పై వరకు వివిధ డిజైన్లలో చెక్కిన తీరు చూపరులను ఆకట్టుకుంటోంది. వందల ఏళ్ళ క్రితమే చూడచక్కగా చెక్కిన శిల్పాలు నేటి కంప్యూటర్ డిజైన్లు, యంత్రాల వినియోగానికి ఏ మాత్రం తీసిపోకుండా ఉన్నాయి. ఇప్పటికీ చెక్కు చెదరకుండా చూపరులను విశేషంగా ఆకర్షించడం నాటి శిల్ప కళ నైపుణ్యతకు నిదర్శనం.



ఆలయం పైభాగంలో ఉన్న వలయాకారం

అప్పుల బాధతో ఉరివేసుకొని బలవన్మరణం


కృష్ణ(ఫైల్)

ముస్తాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పెరుమాండ్ల కృష్ణ(50) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం... పెరుమాండ్ల కృష్ణ నాలుగేళ్ల క్రితం తన కూతురు పెళ్లి కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. ఉపాధికరువై అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతుండేవాడు. ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపైనుంచి కిందపడి పోయాడు. దీంతో చేయికి తీవ్రగాయమైంది. అప్పులతో పాటు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెందిన కృష్ణ తెర్లుమద్ది శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పెరుమాండ్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


లలిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి లలిత(50) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. గ్రామంలో లలిత కొంతకాలంగా మధుమేహం, బీపీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె కొడుకు కళ్యాణ్, కోడలు స్థానికంగా నిర్వహిస్తున్న కిరాణా దుకాణాన్ని ఈనెల6న రాత్రి మూసి వేసి ఇంటికి చేరుకున్నారు. లలిత విరేచనాలు చేసుకుని కింద పడిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే లలిత మృతిచెందిందని నిర్ధారించారు. మృతురాలు కొడుకు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు. మృతురాలికి భర్త అశోక్‌రెడ్డి, కొడుకు కల్యాణ్, కూతురు కవితలు ఉన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన దుర్శెటి కుమార్(34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇంటి తలుపులు తెరిచి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అవివాహితుడైన కుమార్ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు చాలా కాలం క్రితమే మృతి చెందారు. ఒంటరితనంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడని, ఇంటికివచ్చే కిరాయి డబ్బులతో జీవనం సాగించేవాడని పోలీసులు పేర్కొన్నారు. అతని సోదరి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ వెల్ఫేర్ కాంప్లెక్స్ షాప్ నంబరు 9 వద్ద శనివారం 55 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా లభించలేదని, మృతదేహాన్ని ప్రభు త్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు. గుర్తించినవారు ప్రభుత్వాస్పత్రిలోని అవుట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పోగొట్టుకున్న మెడికల్ డాక్యుమెంట్స్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక మహిళా మెడికల్ డాక్యుమెంట్స్, కొంత నగదుతో కూడిన కవర్ బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోగా పోలీసులు ఆమెకు అప్పగించారు. శనివారం ఉదయం ఓమహిళ బస్టాండ్‌నుంచి ఆటోలో ప్రశాంత్ నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చింది. ఆటో దిగి లోపలికి వెళ్లి చూసుకునేసరికి మెడిసిన్ డాక్యుమెంట్లు, నగదు కవర్ కనపడలేదు. వెంటనే డయల్ 100కు కాల్ చేసింది. కంట్రోల్‌రూం నుంచి కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని బ్లూకోల్ట్స్ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు ఆటో డ్రైవర్లను ఆరాతీయగా ఒకఆటోలో కవర్ లభ్యమైంది. ఆ కవరన్‌ను భద్రంగా బాధిత మహిళకు అప్పగించారు.

స్కాన్ చేసి.. అభిప్రాయం చెప్పండి

- పోలీస్‌ల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ
- ఐదు రకాల సేవలకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ యాప్
- అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో క్యూఆర్ కోడ్ పోస్టర్లు
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం
- అవార్డు అందుకున్న ఇబ్రహీంపట్నం, మేడిపల్లి ఎస్ఐలు



మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో అతికించిన సిటిజన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్

ఐదు రకాల సేవలపై అభిప్రాయం..

ప్రధానంగా తెలంగాణ పోలీస్ సేవలపై ప్రభుత్వం దృష్టి సారించి వారు ప్రజలకు ఏ విధానమైన సేవలు అందిస్తున్నారనేది తెలుసుకునేందుకు ఠాణాకు వచ్చిన ప్రజలు ఐదు రకాల సేవలపై క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయం తెలుపవచ్చు. ఇందులో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ చాలన్, పాస్ పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలు అంటూ ఐదు రకాల సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్ల నుంచి ఇప్పటి వరకు ప్రజలు వివిధ రకాలు సమస్యలు, పోలీస్‌ల పనితీరుపై క్యూఆర్ కోడ్‌కు పోస్టులు చేశారు. వీటిలో దాదాపుగా అధికారులు పనితీరులో వారు అందిస్తున్న సేవల్లో అభినందనీయంగానే వచ్చినట్లు తెలిసింది.

మెట్‌పల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కావడం లేదా.. ఫిర్యాదుకు సరైన విధంగా స్పందించడం లేదా.. పోలీస్‌లు సమస్యలు వెంటనే పరిష్కరించి సత్వర న్యాయం చేశారా.. ఇలా పోలీస్ స్టేషన్‌లో ఎదురైన సంఘటనలకు ఫీడ్ బ్యాక్ అందించేందుకు ప్రభుత్వం పోలీస్‌ల పని తీరు తెలుసుకు నేందుకు సిటిజన్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 'మేం మీ అభిప్రా యానికి విలువ ఇస్తాం' అనే స్లోగన్‌తో పోలీస్ ల సేవలపై ప్రజల అభిప్రాయం చెప్పేందుకు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు సర్కార్ శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని ఠాణాల్లో క్యూఆర్ కోడ్‌లను పోలీస్ అధికారులు ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను తీసుకువచ్చి ఐదు నెలల గడుస్తున్నా ప్రజలకు సరైన అవగాహన లేక స్కాన్‌ను సరైన విధంగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

నేరుగా డీజీపీ కార్యాలయానికే...

క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయాలంటే తొలుత సెల్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో పోలీస్‌ల తీరుపై ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుడికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే భయం సైతం నెలకొంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి పోస్ట్ చేసిన వివరాలన్నీ నేరుగా డీజీపీ కార్యాలయానికే వెళ్తోంది. ఆ ఫిర్యాదులను డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు మినహా మరెవరు చూసే అస్కారం లేదని మెట్‌పల్లి డీఎస్పీ రాములు తెలిపారు. దీంతో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ఎవరు భయపడవద్దని పోలీస్‌లు పేర్కొంటున్నారు. ప్రజలు సమస్యలతో పాటు పోలీస్‌లు అందిస్తున్న విశిష్ట సేవలను సైతం పోస్ట్ చేయవచ్చని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్

ఉత్తమ సేవలకు అవార్డు..

సిటిజన్ క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయం తెలుసుకొని తెలంగాణ పోలీస్‌శాఖ ఇటీవల ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన పోలీస్ స్టేషన్లకు అవార్డులు ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 709 పోలీస్ స్టేషన్‌లు ఉండగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో జిల్లాలోని మెట్‌పల్లి సబ్‌డివిజన్ పరిధిలో పని చేస్తున్న ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, మేడిపల్లి ఎస్ఐ శ్యాంరాజ్‌లు అవార్డులు అందుకున్నారు.

ప్రజలు నిర్భయంగా అభిప్రాయం తెలపవచ్చు
ఎ రాములు, డీఎస్పీ, మెట్‌పల్లి



వివిధ సమస్యలపై ఠాణాకు వచ్చే ప్రజలు సిటిజన్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఫీడ్ బ్యాక్‌ను నిర్భయంగా తెలుపవచ్చు. తమ సమస్యలతో పాటు పోలీస్‌లు అందిస్తున్న సేవలపై తమ అభిప్రాయంను అప్లోడ్ చేయవచ్చు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంటాయి. సబ్ డివిజన్ పరిధిలో పోలీస్‌లు అందిస్తున్న ఉత్తమ సేవలకుగానూ ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, మేడిపల్లి ఎస్ఐ శ్యాంరాజ్ డీజీపీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

ఎల్లారెడ్డిపేటలో గోవధపై బీజేపీ నాయకుల ఆందోళన

- పోలీసులతో వాగ్వాదం..
- ఠాణాకు తరలింపు
- వాహనం, మాంసం స్వాధీనం..
- కేసు నమోదు


అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రహస్య ప్రాంతంలో ఓ వర్గం వారు గోవధ చేస్తున్నారనే సమాచారంతో శనివారం బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. గోవధ స్థలానికి చేరుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బీజేపీ నాయకులను అడ్డుకోవడం వల్ల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గోవధ జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోరంటూ ఆగ్రహించారు.నాయకులను ఠాణాకు తరలించారు. నాయకులు పశు వైద్యాధికారి రాహుల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గోవధ చేసేందుకు తాము ఎవరికీ అనుమతించలేదని ఆయన స్పష్టం చేశారు. గోవధ జరిగిన ప్రాంతానికివెళ్లి పంచనామా నిర్వహించాలని తమ సిబ్బందిని ఆదేశించామని పేర్కొన్నారు. 6నుంచి 8ఏళ్ల వయసు ఉన్న కోడెను వధించారని గుర్తించినట్లు చెప్పారు. సుమారు మూడు గంటల పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటనపై బీజేపీ నాయకులతో చర్చించారు. చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గోవధ జరిగిన ప్రాంతంలో ఉన్న పశువులను గోశాలకు తరలించాలని నాయకులు డిమాండ్ చేశారు. పశువులను తరలించేందుకు వినియోగించిన వాహనం, వధించిన మాంసం స్వాధీనపర్చుకుని కేసునమోదుచేసి దర్యాప్తుజరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


సాయి అభిలాష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన గుండు సాయి అభిలాష్ (27) మే 27వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని మూడోఠాణా పోలీసులు తెలిపారు. ఇంటినుంచి బటయకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన వారు కరీంనగర్ మూడోఠాణా 9849888368, 99485 96365లో సమాచారం అందించాలని కోరారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్

గణేశ్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో బీసీ, ఎస్సీఎస్టీమైనార్టీ పేదవిద్యార్థులకు 25శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తెలంగాణ గిరిజనసంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం వచ్చి దాదాపు 16ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పేదలకు విద్యా, వైద్యం అందుబాటులోకి తీసుకొస్తే సరిపోతుందని, మరే ఉచితపథకాల అవసరం పెద్దగా ఉండదని అన్నారు. విద్యాసంస్థలు ఉచితసీట్లు ఇవ్వడానికి ముందుకు రావాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవు తామని తెలిపారు.

జూలపల్లిలో యథేచ్ఛగా గోవధ

- పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

జూలపల్లి, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): జూలపల్లి మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు కొన్నేళ్లుగా పశువుల వధను యథేచ్ఛగా కొన్నేండ్లుగా నిర్వ హిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ మండల నాయకులు పశువధకు అడ్డుపడుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తు న్నారు. మండలంలోని కొందరు వ్యక్తులు శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవులను వధించారనే సమా చారంతో స్పందించిన బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సనత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ సనత్‌కుమార్ బీజేపీ నాయకులతో అక్కడికి చేరుకున్నారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న పశువుల మాంసం, అక్కడ ఉన్న పశువులను సంఘటన స్థలంలో పరిశీలించారు.

ఈ విషయమై పశువులను వధించి మాంసం విక్రయిస్తున్న వ్యక్తుల వివరాలను తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పశువుల వధకు తప్పుడు ధ్రువపత్రాలను అందించిన సంబంధిత పశువైద్యాధికారిపై, అలాగే చట్టవిరుద్ధంగా గోవులను వధించి మాంసం విక్రహిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బొజ్జ సంపత్, సూర్యా, వేల్పుల రమేష్‌పృథ్వీమదుకర్ పాల్గొన్నారు.

మసీదు స్థలంపై పోలీసుల విచారణ

చందుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమ పట్టాభూమిలో అక్రమంగా ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారని చందుర్తి మండలం బండపల్లి గ్రామానికిచెందిన ఓ యువకుడు శనివారం డయల్ 100కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి, కోనరావుపేటమండలాల సరిహద్దు ప్రాంతంలోని బండపల్లి, బావుసాయిపేట గ్రామాలమధ్య 1987లో బండపల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి వద్ద నన్నుసాబ్, రంజాన్ ఆలీలు 0.08 గుంటల స్థలాన్ని మసీదు కోసం కొనుగోలు చేయగా, విక్రయదారుని మృతితో ఈ భూమి పట్టా మార్పిడి జరిగిందని, దాని పట్టాకోసం పట్టాదారురాలు గడ్డం అంతవ్వను పలుమార్లు అడిగితే తమ కుమారులు గల్ఫ్ నుంచి రాగానే పట్టా చేస్తామంటే దాటవేస్తూ వచ్చారని చందుర్తి సీఐ, ఎస్సైలకు బాధితులు, స్థానికులు వివరించారు. దీంతో పోలీసులు డయల్100కు కాల్‌చేసిన కరుణాకర్‌ను పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని చందుర్తి ఠాణావచ్చి సమస్య పరిష్కారం చేసుకోవాలని ఎస్సై రమేశ్ ఆదేశించినట్లు తెలిపారు. స్థల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎలాంటి పనులు చేపట్టకుండాశనివారం ఉదయంనుంచి సాయంత్రం వరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

కొండగట్టులో యువకుడి హత్య

- హతమార్చి గోతిలో పూడ్చివేత
- పోలీసుల అదుపులో అనుమానితులు

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో ఉప్పు రమణారెడ్డి(30) అనే యువకుడు హత్యకు గురి అయ్యాడు. ఓ వివాహ వేడుకల్లో బాగంగా కొండగట్టులో కొందరు యువకులతో జరిగిన గొడవ దాడికి దారి తీయగా అది హత్య వరకు వెళ్లిన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానికులు, పోలీసువర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి మంగళవారం హల్దీ కార్యక్రమంలో పాల్గొన్న యువకులతో గొడవకు దిగాడు. ముగ్గురు యువకులు రమణారెడ్డిపై దాడి చేయడంతోపాటు బండరాయితో తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతదేహాన్ని కొండగట్టు మెట్ల మార్గం సమీపంలో ఉపాధిహామీ పథకంలో తవ్విన కందకాల్లో పూడ్చిపెట్టిన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అయితే రెండు రోజులుగా రమణారెడ్డి హత్యకు గురయ్యాడని ప్రచారం కావడం, కుటుంబసభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం విచారణ చేపట్టారు. సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని ఆదివారం వెలికితీయనున్నట్లు, పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన రమణారెడ్డిపై పీడీ యాక్ట్‌తో పాటు నలబైకి పైగా దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిసింది. పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చిన రమణారెడ్డిపై పోలీసులు గతంలోనే సస్పెక్ట్ షీట్ నమోదు చేశారు.


రమణారెడ్డి(ఫైల్)

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామం చింతలపల్లె వాసులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పరిసర గ్రామల ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు చింతలపల్లె పక్కనే ఉన్న మానేరు నది నుంచి ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అనుమతిచ్చారు. దీంతో గ్రామాన్ని ఆనుకొని ఉన్న మానేరు నది నుంచి ఇసుకను తరలించడానికి వచ్చిన ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను గ్రామం గుండా తరలించేది లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికిచేరుకుని గ్రామస్థులను శాంతింప జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇరుకైన రోడ్లు ఉన్నాయని, ఇసుక రవాణాను మరో మార్గం ద్వారా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని ఇసుక రవాణాను చింతలపల్లె గ్రామం నుంచి కాకుండా గండిలచ్చపేట శివారులో నక్కవాగు పక్కను ఉన్న మార్గం ద్వారా అనుమతి ఇవ్వాలని కోరారు.

- చింతలపల్లి నుంచి ఇసుక రవాణా నిలిపివేయాలి..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

చింతలపల్లి గ్రామం నుంచి ఇసుక రవాణాను నిలిపివేయాలని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందించారు.

హెల్పర్‌కు విద్యుదాఘాతం.. తీవ్ర గాయాలు


గాయపడ్డ హెల్పర్ అంజనేయులు

చందుర్తి జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో నక్క అంజనేయులు అనే అసిస్టెంట్ హెల్పర్‌కు శనివారం తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలో దేవునితండా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా 11కేవీ విద్యుత్‌వైర్లు తగలడంతో అంజనేయులు కింద పడ్డాడా. ఈప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆంజనేయులును 108లో వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ అంజనేయులును సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సెస్ సిబ్బంది పరామర్శించారు.

ప్రమాదవశాత్తు రైతుకు తీవ్ర గాయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన చిట్కూరి అజయ్ కుమార్ శనివారం ఇరుకుల్ల శివారులో నారుమడి కోసం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్‌కు అడ్డుగా ఉన్న డ్రిప్ పైపును కాలుతో తప్పించే క్రమంలో అదుపు తప్పి రోటవేటర్‌లో పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు అజయ్‌ని బయటకు తీసేందకు గంట పాటు శ్రమించారు. తీవ్రంగా గాయపడిన రైతును చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చొప్పదండి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ క్రాస్‌రోడ్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం బైక్‌ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆర్నకొండకి చెందిన ఆవునూరి సంపత్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని సంపత్‌ను పోలీస్‌వాహనంలో నగునూరులోని ప్రతిమ హాస్పిటల్‌కి చికిత్స కోసం తరలించారు.

ధరూర్‌లో భారీ అగ్నిప్రమాదం

- రూ. 70 లక్షలు ఆస్తి నష్టం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జగిత్యాలరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలోని పాత సామానుల దుకాణంలో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగిసిపడి షెడ్డుతో పాటుగా, షెడ్డులో ఉన్న సామగ్రి, యంత్రాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. పాత సామానుల దుకాణం పక్కనే పెట్రోల్ బంక్, గృహసముదాయాలు ఉన్నాయి. సకాలంలో ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో షెడ్డు యజమాని కొలగాని సత్యనారాయణరావుకు 40లక్షల రూపాయలు, ముంబాయికి చెందిన పాత సామాను దుకాణ యజమానికి 30లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు అంచనా వేశారు. సంఘటన స్థలాన్ని కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి సందర్శించారు. సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


దగ్ధమవుతున్న పాత సామానుల దుకాణం

ఓబులాపూర్‌లో చిరుత కలకలం

- గొర్రెపై దాడి.. మృతి

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో చిరుతపులి కలకలం రేపింది. శనివారం మేతకు వెళ్లిన గొర్రెల మందలోని ఓ గొర్రెపై దాడి చేసి చంపేసినట్లు యజమాని గుగ్గిళ్ల తిరుపతి తెలిపారు. తిరుపతికి చెందిన సుమారు అయిదు వందల గొర్రెలు మేతకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లగా మంద వెనుకాల వెలుతున్న గొర్రెపై చిరుత దాడి చేసినట్లు పేర్కొన్నారు. గొర్రెపై దాడి చేయడాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. చిరుతపులి సంచారంతో సమీప ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.



నేడు మంత్రి వర్గ విస్తరణ

- కవ్వంపల్లి, అడ్లూరిలో ఒకరికి అవకాశం
- రేసులో ఆది శ్రీనివాస్ కూడా..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ ఆదివారం జరగనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లో ఒకరికి అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. బీసీల్లో ఇద్దరికి అవకాశం కల్పిస్తే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో నలుగురికి చోటు కల్పిస్తారని వారిలో మాదిగ, బీసీ, రెడ్డి లేక వెలమ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉంటారని అంటున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లో ఒకరికి అవకాశం ఖాయమనే వార్తలు కాంగ్రెస్ వర్గాల నుంచి వినవస్తున్నాయి.

చెన్నూర్ శాసన సభ్యుడు వివేక్ వెంకటస్వామికి బెర్త్ దాదాపుగా ఖాయమని ఆయనతో పాటు మరొక ఎస్సీకి అవకాశం కల్పిస్తే జిల్లాలోని ఇద్దరు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం దక్కుతుందని అంటున్నారు. బీసీ సామాజిక వర్గంలో వాకాటి శ్రీహరి (ముదిరాజ్)కి మంత్రి పదవి దక్కుతుందని, ఇద్దరు బీసీలకు అవకాశం కల్పిస్తే వేములవాడ శాసన సభ్యుడు, విప్ ఆది శ్రీనివాస్‌కు ఆ బెర్త్ కట్టబెడతారని అంటున్నారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ కూడా మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముగ్గురు లేక నలుగురికి మంత్రి పదవులు దక్కుతాయని భావిస్తున్న ఈ విస్తరణపై ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఆశలు పెట్టుకున్నారు. ఎవరి ఆశ నెరవేరుతుందో, అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇస్తారోనని జిల్లా కాంగ్రెస్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాల జిల్లా రంగాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణజాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో పలుప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైన కవిత మేడిపల్లి మండలం రంగాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలుచేసిన ఉద్యోగులను కాంగ్రెస్‌ప్రభుత్వం కించపరిచిందన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. టీఏలు, డీఏలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇస్తామని ఉద్యోగస్థులను నమ్మించారన్నారు. టీఏలు, డీఏలు సమయానికి వేతనాలు ఇస్తామని, ఒకటో తేదీ నిండకముందే అన్ని రకాల కిస్తీలు కట్టుకునే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు ఉద్యోగులను మోసగించిందని విమర్శించారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఒక్క డీఏ విదిల్చారని.. ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్రఅసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఉద్యోగస్థుల త్యాగాలను, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగస్థుల పాత్రను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, నాయకులు ఒరుగంటి రమణారావు, రాంమోహన్‌రావు, దారిశెట్టి రాజేశ్, మారు సాయిరెడ్డి, ఎలాల దశరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు కోడెలు మృతి

- మరో రెండింటి పరిస్థితి విషమం

వేములవాడ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం తిప్పాపూర్ గోశాలలో మరో రెండు కోడెలు మృతిచెందాయి. అనారోగ్యంతో ఉన్న రెండు కోడెలు శనివారం తెల్లవారు జామున మృతిచెందినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు గోశాలలో మృతిచెందిన కోడెలసంఖ్య 33కుచేరింది. గోశాలలో అనారోగ్యం బారిన పడిన 14కోడెలకు వెద్యాధికారులు చికిత్స అందిస్తుండగా, వాటిలో 10 కోడెలు కోలుకుంటున్నట్లు తెలిపారు. మరో రెండు కోడెల పరిస్థితి విషమంగా ఉందని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఆహార నాణ్యతకు మారుపేరు ఐసీహెచ్

- ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం
- ఆహార భద్రత దినోత్సవంలో ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్



ఐసీహెచ్ మేనేజర్ కార్తికేయన్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు


జ్యోతినగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులలో ఇండియన్‌కాఫీ హౌజ్(ఐసీహెచ్) ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నదని ఆప్రాజెక్టు ఏజీఎం (హెచ్‌ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్ అన్నారు. ప్రపంచ ఆహారభద్రత దినోత్సవాన్ని శనివారం ఎన్టీపీసీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం ప్రసంగిస్తూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడంవల్ల ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా మంచిసర్వీస్ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులతోపాటు పలు ఇండస్ట్రియల్ క్యాంటీన్లను నిర్వహిస్తున్న ఐసీహెచ్ ప్రపంచ స్థాయి సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. నాణ్యత, నిర్వహణ, సర్వీసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఐసీహెచ్ పేరు నమోదు చేసిందని సిక్దర్ గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా ఐసీహెచ్ సిబ్బంది ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఇండియన్‌కాఫీ హౌజ్ మేనేజర్ పి.ఎస్.కార్తికేయన్‌ను ఏజీఎం సన్మానించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ఐసీహెచ్‌కు సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు. డీజీఎంలు ప్రవీణ్ చౌదరి, జితేంద్ర కుమార్, సీనియర్‌మేనేజర్ ఆదేశ్‌కుమార్ పాండే, పాల్గొన్నారు.

నేడు ఉమ్మడిజిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ బాల బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల10,11తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మెదడులో ముప్పు..
ముందస్తుగా గుర్తిద్దాం..

నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే



సుభాష్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో ముఖ్యమైనది మెదడు. మెదడులోని కణజాలాలు అవయవాల పనితీరులో కీలకంగా పని చేస్తాయి. మెదడులోని కణజాలాల్లో ఏర్పడుతున్న కణితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. దేశంలో బ్రెయిన్ ట్యూమర్ (మెదడు కణితి) కేసుల సంఖ్య పెరుగుతోంది. ఏటా 28వేల మందికిపైగా భారతీయులు దీని బారిన పడుతున్నారు. అన్ని కణుతులు ప్రమాదకరమైనవి కాకపోవచ్చని, లక్షణాలు గమనించి వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్ అంటే మెదడులో కణితి అని అర్థం.

మెదడు లేదా చుట్టు పక్కల కణ జాలంలో అసాధారణ రీతిలో కణాల పెరుగుదల ఉంటుంది. సాధారణ మెదడు కణాలు జన్యు మార్పులకు లోనైనప్పుడు ఈ పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో నిరపాయకరమైనవి ఉంటాయి. అవి నెమ్మదిగా పెరుగుతాయి. శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించవు. ప్రాణాంతక కణుతులు మెదడు కణజాలంపై దాడి చేస్తాయి. జన్యుపరమైన కారకాలు, పర్యావరణ ప్రభావాలు, కొన్నిసార్లు ఎటువంటి కారణం లేకుండానే ఈ కణుతులు వస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్ డే నేపథ్యం

ప్రపంచంలో బ్రెయిన్ ట్యూమర్ ప్రభావం, నిరంతర పరిశోధన, అవగాహన, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం కోసం యేటా జూన్ 8న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మెదడు కణితి అనేది పెద్దలు, పిల్లలు ఎవరిలోనైనా ప్రభావితం చేసే ప్రాణాంతక రుగ్మతల్లో ఒకటి. మెదడులో కనిపించే అన్ని ప్రా థమిక కేంద్రనాడీ వ్యవస్థ కేన్సర్లలో ఎక్కువ భాగం(85-90%) మెదడు కణితుల కారణంగానే సంభవిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

లక్షణాలు : కణితి ప్రాంతాన్ని బట్టి ప్రారంభ లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, మూర్ఛ, మాట్లాడడం, ఆలోచించడంలో ఇబ్బంది ఏర్పడడం, ప్రవర్తనలో మార్పు, పక్షవాతం, సమతుల్యత కోల్పోవడం లేదా తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మసక దృష్టి, వినికిడి లోపం, ముఖం తిమ్మిరి, వాంతులు, మింగడంలో ఇబ్బందులు, గందరగోళ మనస్తత్వం, ఆసక్తి లేక పోవడం, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చు

డాక్టర్ రాజీవ్‌రెడ్డి, న్యూరో సర్జన్, మెడికవర్ హాస్పిటల్



లక్షణాలు గమనించి వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే నయం చేయవచ్చు. ప్రస్తుతం వైద్య రంగంలో అత్యాధునిక వైద్యం, పరిక రాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో డాక్టర్‌ను సంప్రదిస్తే బ్రెయిన్ ట్యూమర్‌ను తగ్గించొచ్చు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారిని దర్శించుకున్న 60 వేల మంది



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాజన్న ఆలయానికి శనివారం 60 వేల మందికి పైగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. అనంతరం పరివార దేవతాలయాలైన సీతారామచంద్రస్వామి, అనంతపద్మనాభస్వామి, సోమేశ్వర స్వామి, బాలత్రిపుర సుందరీదేవి ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు శివకల్యాణ పూజలో పాల్గొని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సినీ ఇండస్ట్రీ డీవోపీ ప్రయాంక వర్మ, భూపతిరాజులు దర్శించుకున్నారు. అర్చకులు వారిని ఆశీర్వదించి రాజన్న ప్రసాదం అందించారు.

- రూ. 5 లక్షల విరాళం

వేములవాడ పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు మధు గుండయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి మధులక్ష్మీ, కుమారులు డాక్టర్ రాధకిషన్, శ్రీనివాస్‌లు రూ.5 లక్షల విరాళాన్ని బ్రహ్మణ నిత్యాన్నదాన సత్రం కోసం అందజేశారు. శంకరమఠంలో బ్రహ్మణ సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప రామకృష్ణ, బుడంగారి మహేష్ తదితరులు ఉన్నారు.

డీఈఈ సెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీజీ డీఈఈ సెట్-2025 ఫలితాలు ప్రకటించారని ఇందులో ఉత్తీర్ణులైన ఆసక్తి, అర్హతగల అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన జూన్9 నుంచి ఉంటుందని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఎల్ఎండీ కాలనీలోగల ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లో జూన్9 నుంచి ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో డీఈఈ సెట్-2025 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఇంటర్ వరకు స్టడీ, కుల, ప్రస్తుత సంవత్సర ఆదాయం సర్టిఫికేట్‌లతో కేటాయించిన జిల్లా డైట్‌కు వెళ్లి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఈఈ -2025 వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

వేములవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య తన కూతురు మధురిమను వేములవాడజిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చేర్పించారు. కథలాపూర్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిష్టయ్య 9వ తరగతి చదువుతున్న తన కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించుకున్నారు. శనివారం వేములవాడలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల విద్యాధికారి, పాఠశాల హెచ్ఎం బన్నాజి తదితరులు అభినందించారు.



వేములవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య

భక్తులతో పోటెత్తిన కొండగట్టు



క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువ జాము నుంచి తరలివచ్చిన భక్తులతో అంజన్న ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. వ్యవసాయ పనులు ప్రారంభం కానుండడం, విద్యసంస్థలు తిరిగి తెరచుకోనుండడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగగా వాహనాలతో జైజంక్షన్ వద్ద ఇబ్బందులు పడ్డారు. భక్తులు అంజన్నతో పాటు బేతాళుడు, రాముల వారని దర్శించుకున్నారు. నూతన వాహనాలకు అంజన్న సన్నిదిలో పూజలు చేయించారు.

ధర్మపురి నరసింహుని సన్నిధిలో భక్తుల సందడి

- కిటకిటలాడిన ఆలయాలు
- భక్తుల పూజలు



నరసింహ స్వామివారల హారతి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. సెలవు దినాలు కావడంతో ఉదయం వరకు క్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం ఆల యాలకు చేరుకుని భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం జరిపించి పూజలుచేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయస్వామిచుట్టు భక్తులు ప్రదక్షి ణాలు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీ ణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మం త్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చ కులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చారి, చిలుకముక్కు రమణాచారి, నంబి నరసింహమూర్తి నిత్య పూజ లు నిర్వహించారు.భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాల విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలఫలితాలు విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య, ఉమ్మడి జిల్లా పరీక్షల కో-ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒకప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఎస్సెస్సీలో571 విద్యార్థులకు245మంది 42.91శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పెద్దపల్లి జిల్లాలో 340 మందికి 197మంది 57.94శాతం, కరీంనగర్ జిల్లాలో 440మందికి 324మంది 73.64 శాతం, రాజన్నసిరిసిల్లజిల్లాలో 267 మందికి 240 మంది 89.89శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్మీడియెట్‌లో జగిత్యాలలో 574మందికి 305మంది 53.14శాతం, పెద్దపల్లిజిల్లాలో 705మందికి 396మంది 56.17శాతం, కరీంనగర్‌లో 967మందికి 661మంది 68.36శాతం, రాజన్నసిరిసిల్లలో 792 మందికి 558 మంది 70.45శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

కలికోట-పోతారం రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- ఏళ్లుగా వినతులను పట్టించుకోని పాలకులు
- వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా ఉన్న కలికోట - పోతారం రోడ్డు

కథలాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాలైన కలికోట-పోతారం గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణంపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు బాగుచేయాలని వినతిపత్రాలు అందిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి తమగోడు వెల్లబోసుకుంటున్నా తమ పట్ల కనికరం చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

- లొంకరామేశ్వరుని దర్శనానికి ఇబ్బందులు

పోతారం గుట్టల్లో స్వయంభూ దేవాలయంగా ప్రసిద్ధిచెందిన లొంకరామేశ్వర స్వామిని దర్శనం చేసుకునేందుకు వందలాదిగా వెళ్తుంటారు. వేములవాడ-కోరుట్ల రహదారిని ఆనుకుని ఉన్న కలికోట నుంచి పోతారం కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అక్కడి నుంచి మరో రెండు కిలోమీటర్లు వెళితే లొంకరామేశ్వరుని సన్నిధానానికి చేరుకుంటారు. భక్తులకు ఈ రోడ్డు వెంట వస్తే దూరభారం తగ్గుతుంది. ఈ విషయం అనేక సార్లు ఎంపీలు, ఎమ్మెల్యేలకు చెప్పుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో ఈ రోడ్డు వెంట కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. గతంలో పలుమార్లు ఎన్నికల్లో ఈ రోడ్డును బీటీగా మార్చుతామని నాయకులు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి మారుమూల గ్రామాల రోడ్లను మెరుగు పరిచేందుకుగాను ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద నిధులు వెచ్చించాలని గ్రామస్థులు చేసిన వినతికి అధికారులు సర్వేలు చేసి గతంలో ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపారు. పలు కారణాలు చూపి ఈ పథకం కింద నిధులు వెచ్చించడానికి అవకాశాలు లేవని చేతులెత్తేసినట్టు తెలిసింది.

- బీటీ రోడ్డుగా మారిస్తే ఎంతో సౌకర్యం

ధర్మపురి జలంధర్, మాజీ సర్పంచ్ పోతారం



కలికోట-పోతారం లింకు రోడ్డు బాగు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఎన్నోసార్లు ఎమ్మెల్యే, ఎంపీలకు గ్రామస్థులమంతా కలిసి వినతిపత్రాలు ఇచ్చినా నిధులు మాత్రం కేటాయించలేదు. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని నాయకులు చెబుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. రోడ్డ మెరుగు పడితే లొంకరామేశ్వరుని వద్దకు బస్సు వసతి కలగడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఈ రోడ్డును బీటీగా మార్చడానికి నిధులు కేటాయించాలి.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



సుల్తాన్‌పూర్ దర్గాలో ముస్లింల ప్రార్థనలు

ధర్మారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగని ఇమామ్ ఎండి అసమ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇమామ్‌లు ఎం.డీ. అసమ్, ఎండీ జాఫర్ పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఎలిగేడు, ధూళికట్ట, లాలపల్లి, సుల్తాన్‌పూర్, ముప్పిరితోట గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పర్వదినం ప్రాముఖ్యతను ముస్లిం మత పెద్దలు వివరించారు.



ధర్మారం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలు నిర్వహించారు. దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. పొత్కపల్లితో పాటు గుంపుల, కనగర్తి, ఓదెల, కొలనూర్ గ్రామాల్లోని మజీద్‌లలో ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌ఐ రమేష్, నాయకులు, ముస్లిం సోదరులు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, పెద్దబొంకూర్, అందుగులపల్లి, రంగాపూర్, గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాల్లోని మజీద్‌లలో ప్రార్థనలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను మండల వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను సుల్తానాబాద్ పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి నీరుకుళ్ల రోడ్డులో గల ఈద్గా వద్దకు చేరుకున్నారు. అనంతరం సామూహికంగా ప్రార్థనలు చేశారు. మత పెద్దల ప్రసంగాల అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గట్టేపల్లి, అల్లీపూర్, రేగడిమద్దికుంట, కదంబాపూర్ తదితర గ్రామాలలో పండుగను జరుపుకున్నారు.



పొత్కపల్లిలో బక్రీద్ వేడుకల వద్ద ఎస్‌ఐతో ముస్లిం సోదరులు

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండల కేంద్రంతో పాటు వడుకాపూర్, పెద్దాపూర్, తెలుకుంటా తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎండి షాబోద్దిన్, రహీం, చాంద్‌పాషా, ఎండి పకీర్, ముస్లింలు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్ దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రజా పోరాటాలు నిర్వహించాలి



న్యూడెమోక్రసీ నుంచి మాస్‌లైన్‌లో చేరుతున్న నాయకులు

గోదావరిఖని, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దేశంలో మరింత బలంగా ప్రజా పోరాటాలు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా నాయకుడు నంది రాజయ్య అన్నారు.ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం టీయూసీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు ఇస్సంపల్లి రాజేందర్, పుల్లూరి నాగభూషణం, బుషిపాక దేవయ్య, డివిజన్ కమిటీ సభ్యులు చిలుక రాజులు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథాలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేరికలు కోల్‌బెల్ట్ ప్రాంతంలో బలమైన కార్మిక ఉద్యమాలు నిర్మించడానికి దోహపడుతాయన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, గొల్లపెల్లి చంద్రయ్య, వైకుంఠం, రాములు, శంకర్, రమేష్, లక్ష్మి, ఓదెలు, రాయమల్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

ఎలిగేడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు తహసీల్దార్ యాకన్నను మండల దళిత సంఘాల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను సన్మానించారు. మాజీ సర్పంచ్ రాజా, న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, జల్లి రమేష్, రాజేశం, గొల్లె లక్ష్మణ్, చెవుల అజయ్, చందు, బాసంపల్లి రాజేశం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్నసదానందంను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ సన్మానించారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ స్వప్నసదానందం కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న పనులపై ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డిని తెలుసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ ఎంపీటీసీ మొండయ్య, డైరెక్టర్లు ద్యాగేటి రామచంద్రం, ఎనగంటి రవి, సిబ్బంది ఆషాడపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన



మూలసాలలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లల్లో శారీరక, మానసిక, నైతిక, సామాజిక వికాసం కలుగుతుందని మూలసాలలో చేపట్టిన బడిబాటలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శనివారం గ్రామంలోని పలు ఇళ్లు తిరుగుతూ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, వసతులు, ఉత్తమ విద్యాబోధనపై వివరించారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయుల బోధన ఉంటుందని, ప్రయివేట్ పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ హై జావిద్, ఉపాధ్యాయులు దెబ్బెట రాములు, కూకట్ల తిరుపతి, సదానందం, సంజీవ్, సాధుల వెంకటేశ్వర్లు, జ్యోతి పాల్గొన్నారు.

కటికెనపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ధర్మారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కటికెనపల్లి గ్రామంలోని ముదిరాజ్ కులస్థులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు చేసినట్లు మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు రేండ్ల కోటయ్య, ఉపాధ్యక్షుడు సిరవేణి తిరుమల రాజేశం, మాజీ ఉపసర్పంచ్ రామడుగు గంగారెడ్డి, సంఘం డైరెక్టర్లు, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్లు కోట కరుణాకర్, దాసరి శ్రీకాంత్, బోనగిరి మహేష్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ...

కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రామ గుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసు పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్థులకు 2డీ ఎకో, ఈసీజీ, మధుమేహ వ్యాధి, కంటి వైద్య పరీక్షలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కం దుల సతీష్, బూర్ల శ్రీనివాస్, ఆడెపు రాజేశం, నాంపల్లి సతీష్, ప్రభాకర్, దబ్బెట మల్లేషం, రాజేశం, రాకేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు ఆర్థిక చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న దేవి జనార్దన్

ధర్మారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త మహంకాలి ప్రతాప్‌కు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ పీఎసీఎస్ చైర్మన్ దేవి జనార్దన్ రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, దేవి అఖిల్ తదితరలు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు

ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్



కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనాలను రోడ్లపై నిలిపితే కఠినచర్యలు తీసుకుంటామని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం గోదావరిఖనిలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో అనేక భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, రాజీవ్ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల వాహనాలను రోడ్లపైన నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణ మవుతున్నారని, మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, లేకపోతే జరిమానా విధిస్తామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపడం వల్ల ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వ వద్దని, మైనర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహ నాలు ఇస్తే తల్లిదండ్రులు, యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. అతి వేగంగా మద్యం మత్తులో వాహనాలు నడపడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్, మంచిర్యాల ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం మార్కండేయకాలనీలో ట్రేడ్ లైసెన్స్‌లపై కార్పొరేషన్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారస్థులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుని నగరపాలక సంస్థ ఆదాయం పెరిగేందుకు సహకరించాలన్నారు. వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్న భవనాలను రెసిడెన్షియల్ క్యాటగిరి నుంచి కమర్షియల్ మారుస్తున్నామని, లైసెన్స్ ఉన్న షాపుల కొలతలను పరిశీలించి సరిగా ఉన్నాయో లేదో నిర్ధారించుకుంటామన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఆన్‌లైన్‌లో పొందే విధానంపై అవగాహన కల్పించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, ట్రేడ్‌లైసెన్స్ ఇన్‌చార్జి సంపత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రామగుండాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

కోల్‌సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం 28వ డివిజన్ వినోభానగర్‌లో రూ.5లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌కు రూ.500కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో ప్రజలకు మౌలిక వసతులు మంచినీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు నిర్మించి సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, ముస్తాఫా, నెలకంటి రాము, తాళ్లపల్లి యుగంధర్, గట్ల రమేష్ పాల్గొన్నారు.



యుజీడీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రేషన్‌కార్డుల పంపిణీ

పేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం అంతర్గాంకు చెందిన 194మంది లబ్ధిదారులకు తెల్లరేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. తహసిల్దార్ రవీందర్, నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవేశాలకు ఇంటింటా ప్రచారం

ముత్తారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యా యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యం వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. జడ్పీ హెచ్‌ఎస్ పోతారం ప్రధానోపాధ్యాయులు డి లక్ష్మీరాజం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సత్తయ్య, ఉపాధ్యాయులు రాజ్ కుమార్,జె శ్రీనివాస్, చంద్రమౌళి, ఆర్ శ్రీనివాస్, నాగేందర్, కే శ్రీనివాస్, వీణ, రాధా, అంగన్వాడి టీచర్ శోభ,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్నిరకాలుగా ప్రభుత్వం వసతులను ఏర్పాటుచేసి వారి విద్యకు భరోసా కల్పిస్తుందని మండల విద్యాధికారిని సరస్వతి అన్నారు. మండలకేంద్రంలో శనివారం బడిబాట కార్యక్రమంలో బాగంగా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలని గ్రామంలో ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని, తల్లిదండ్రులు ఉపయోగించుకుని సర్కారు బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని ఎంఈఓ సరస్వతి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలానికి రాజధాని ఏసీ సర్వీసు

కళ్యాణ్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి ఈ నెల 9న అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఏసీ రాజధాని బస్సును నడపనున్నట్టు ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 3గంటలకు గోదావరిఖనిలో బయలుదేరి కరీంనగర్‌లో 4గంటలకు ప్రారంభమవుతుందని, కాణిపాక వినాయక దేవస్థానం, మహాలక్ష్మి టెంపుల్, వేలూరు దర్శనం అనంతరం 10న రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరిప్రదర్శన, దర్శనం అనంతరం 11న మధ్యాహ్నం 3గంటలకు తిరుగు ప్రయాణంలో జోగులాంబ, ఆలంపూర్ మీదుగా 12న సాయంత్రం 6గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. పెద్దలకు గోదావరిఖని నుంచి రూ.5900, పిల్లలకు రూ.4900, కరీంనగర్ నుంచి పెద్దలకు రూ.5550, పిల్లలకు రూ.4,650చార్జీలుగా నిర్ణయించనట్టు, రిజర్వేషన్‌కు 7013504982, 7989847927 నెంబర్లలో సంప్రదించాలని డీఎం కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూతాపం పెరిగిపోతున్నదని, దీన్ని నివారించేందుకు మొక్కలు నాటాలని అన్నారు. పీల్చే గాలి, తాగే నీరు ఎంత కలుషితం చేస్తున్నామో ఆలోచించాల న్నారు. వాతావరణాన్ని కలుషితం చేయకుండా ప్రకృతిని పదిలంగా కాపాడుకోవాలన్నారు. జూట్ బ్యాగులను జీఎం కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యతలో భాగంగా ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలించేందుకు జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్లాస్టిక్‌తో మనుషులకే కాకుండా ప్రతీ ప్రాణికి ప్రమాదమున్నదన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకో వాలని, నిత్యావసరాల వస్తువులకు కూడా జూట్ బ్యాగు లనే వాడాలని అన్నారు. ఆర్‌జీ-2 ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, పర్యావరణ అధికారి ఆంజనేయ ప్రసాద్, సీఎంఓఏ నాయకుడు శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకుడు రాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అధికారులు దాసరి వెంకటేశ్వర్‌రావు, కరుణ, ధనలక్ష్మిబాయి, లక్ష్మీరాజం, భీమ, హనుమంతరావు పాల్గొన్నారు.



మహాసభలను విజయవంతం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు

గోదావరిఖని, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఆదివారం టీయూసీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు తోకల రమేష్ కోరారు. శనివారం ఆర్‌జీ-1 పరిధిలోని పలు సింగరేణి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకులు గుండ్ల పోషం, కొయ్యడ వెంకటేష్, ఆర్ లక్ష్మీనారాయణ, తిరుమల, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత నివారించాలి

గోదావరిఖని, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఆసుపత్రుల్లో మందుల కొరత ఉన్నదని, చాలా చోట్ల డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. శనివారం సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఏఐటీయూసీ ప్రతినిధి బృందం సందర్శించింది. యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లయ్యగౌడ్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఆసుపత్రుల్లో మందుల కొరత, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ అంబికకు సమస్యలను వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మందులు సరిపడా ఇవ్వడం లేదని ఆరోపించారు. సింగరేణి రెఫరల్ ఆసుపత్రుల్లో మందులు అందించే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌తోపాటు గోదావరిఖని, భూపాలపల్లి, రామకృష్ణాపూర్ మణుగూరు, ఇల్లందు ఏరియాల్లో ఖాళీగా ఉన్న ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, రేడియాలజిస్ట్, సాంకేతిక సిబ్బంది, ఎక్స్‌రే పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, చక్రపాణి, తిరుపతి, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య పాల్గొన్నారు.

ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

గోదావరిఖని, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా పరిధిలో ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఎస్సీలకు ఆ పోస్టులను కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వర్ రావు కోరారు. శనివారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ రోస్టర్ పరిశీలన కమిటీ సభ్యులు ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తోపాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీల పదోన్నతుల కోసం రోస్టర్ రికార్డుల రిజర్వేషన్‌ను ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, సింగరేణి కార్పొరేట్ ఎస్‌సీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఎస్‌సీ సంఘం జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వర్ సమక్షంలో పరిశీలించారు. ఆర్‌జీ-1 ఏరియాలో ఎస్‌సీ ఉద్యోగులకు కేటాయించిన రిజర్వేషన్ సక్రమంగా అమలువుతుందా? లేదా? తెలుసుకున్నారు. ప్రమోషన్లకు సంబంధించిన సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏరియా స్థాయి గనుల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ పోస్టులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఒక వేళ కోటా ప్రకారం లేకుంటే ఇతర మైన్స్ నుంచి తీసుకొని భర్తీ చేయాలని కోరారు. ఎస్సీ సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీరావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, హన్మంతరావు, కుంట్ల తిరుపతి, వెంకటేశ్వర్లు, హరీష్, రాజేష్, ప్రభాకర్, కుమార్, తిరుపతి, రామగిరి వెంకటస్వామి, శివసాయి పాల్గొన్నారు.



బ్యాక్‌లాగ్ పోస్టులపై పరిశీలిస్తున్న జీఎం, ఎస్సీ సంఘం నాయకులు